సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



చీనీ కాయల మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత

పులివెందుల పట్టణ పరిధి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని చీనీకాయల మార్కెట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. - 8లో



పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

రాష్ట్ర వ్యాప్తంగా ఇమామ్, మౌజన్లకు ఇవ్వాల్సిన పెండింగ్ గౌరవ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36.0 /25.4

వాతావరణం

జిల్లాలో సోమవారం 25.4 – 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

శ్రీ సత్యసాయి జిల్లా బీసీ జిల్లా కమిటీ ఇన్‌చార్జిగా బసవరాజు



కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎస్. బసవరాజును శ్రీ సత్యసాయి జిల్లా బీసీ జిల్లా కమిటీ ఇన్చార్జిగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సమ్మెట బసవరాజు మాట్లాడుతూ తనకిచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చి పార్టీకి మంచి పేరు తెస్తానని, శ్రీ సత్యసాయి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

10 నుంచి ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి సెలక్షన్స్ ఈ నెల 10 నుంచి 17వరకు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ శ్రీకాంత్ చంద్రావతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రకాల క్రీడా పోటీలతో నిర్వహించే ఈ సెలక్షన్స్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు.

మార్కెటింగ్ ఏడీకి 'షోకాజ్'

కడప సెవెన్‌రోడ్స్ : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్కెటింగ్ శాఖ ఏడీ ఆజాద్‌వల్లికి సోమవారం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి షోకాజ్ నోటీసును జారీ చేశారు. రెండు రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ నోటీసుల్లో పేర్కొన్నారు.

జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్, అధ్యాపకులు

వేంపల్లె : జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ విభాగంలో చదువుతున్న విద్యార్థులు బి.నాగ పవన్, ఎస్.అరవింద్, జి.విజయ్ కుమార్, డి.రవితేజ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని సత్తా చాటారని వెల్లడించారు. ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ బిలయోలో నిర్వహించే యోగాసన భారత్ జాతీయ స్థాయిపోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై డైరెక్టర్‌తోపాటు పరిపాలన అధికారి రవికుమార్, డీన్ రమేష్ కైలాస్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్‌ను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ పరీక్షకు నమోదు చేసుకునుటకు ఈ నెల 30 వరకు గడువు ఉందని తెలిపారు. ఈ పరీక్ష రాయటకు ఏపీలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యంలేని ఆంధ్రప్రదేశ్ పాఠశాలల్లో ఈ సంవత్సరం 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం రూ. 3,50,000 లోపు ఉన్న విద్యార్థులందరూ అర్హులు అని తెలిపారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీబీ విద్యార్థులకు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 50 ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇవ్వబడిన ఎస్‌బీఐ కలెక్ట్ లింగ్ ద్వారా మాత్రమే పరీక్ష రుసుం చెల్లించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ప్రభుత్వ పరీక్షల విభాగం వారిని కలవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చూడాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేశారు. సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు ఆలయాన్ని తెరిచారు. ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి స్వామి, అమ్మవారిని అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చిరు. మాఢవీధులు, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

పల్లె ముంగిట.. ఎరువు మంట!



- రైతులకు సకాలంలో దొరకని ఎరువులు, విత్తనాలు
- పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతున్న అన్నదాతలు
- నేడు రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరుబాట



దువ్వూరులోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద ఎరువుల కోసం వేచి ఉన్న రైతులు

కడప అగ్రికల్చర్ : ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతంటేనే పట్టదు..వ్యవసాయమంటే అస్సలు గిట్టదు.. ఇంకేముంది ఈ కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. అసలే వర్షాలు పడక.. ఆపై పొలం తడవక అవస్థ పడ్డ రైతన్నకు.. అరకొరగా సాగు చేసిన పంటకైనా కాసింత ఎరువులేద్దామంటే ఒక్క బస్తా యూరియా చిక్కక అల్లాడుతున్నాడు. ఎరువులు.. విత్తనాల కోసం ఒకటా రెండా రోజుల తరబడి క్యూలో నిల్చున్నా ఫలితం దక్కడం లేదు. దీంతో అన్నదాత ఉసూరుమంటున్నాడు. అరకొరగా సాగు చేసిన పంటలకు సైతం సరైన దిగుబడులు రావేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సంబంధిత రైతు సమస్యలపై మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు రైతులకు మద్దతుగా అన్నదాత పోరుబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ తీరును ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ఎక్కడికక్కడ ర్యాలీలు, నిరసనలు చేపట్టి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

35 శాతం మించి సాగుకాని పంటలు...

ఖరీఫ్ సీజన్ సాధారణసాగు 77,551 హెక్టార్లుకాగా ఇప్పటి వరకు కేవలం 26,835.54 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే 34.60 శాతం మేర పంటలసాగు అయింది. మరో 20 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగుస్తుంది. అంటే ఇప్పటికి సగానికి తక్కువ శాతమే పంటలు సాగయ్యాయి. జిల్లావ్యాప్తంగా 65.4 శాతం బీడుభూములే ఉన్నాయి. ఒక్క మొక్కజొన్న, రాగి మాత్రమే వందశాతం మించి సాగుకాగా మిగతా ఏ పంటలు 50 శాతం మించి సాగుకాలేదు.

దొరకని ఎరువులు...

ఖరీఫ్ సీజన్ ప్రారంభం తరువాత ఎరువుల కొరత నెలకొంది. ఇందులో ముఖ్యంగా యూరియా కొరత అన్నదాతలకు ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ఏడాది ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం డ్యాం నుంచి కేసీ కెనాల్‌కు నీరు వదిలారు. దీంతో దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు, బిమఠం, సిద్దవటం, జమ్మలమడుగు, కమలాపురం కొండాపురం, రాజుపాలెం మండలాల పరిధితోపాటు తెలుగుగంగ, పెన్నా, కుందూతోపాటు బోరుబావుల కింద దాదాపు 15 వేలు హెక్టార్లలో వరి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం ఆ వరిపంటలకు యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, మన గ్రోమోర్ సెంటర్లు, ప్రైవేటు డీలర్ల వద్ద పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. గంటల తరబడి క్యూలైన్లలో నిలుచుండాల్సిన పరిస్థితి దాపురించడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్తా యూరియా కోసం పొలం పనులన్నీ వదులుకుని రోజుల తరబడి తిరగాల్సి వస్తోందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

గిట్టుబాటు ధర కరువు...

జిల్లాలో ప్రస్తుతం ఉల్లిపంట చేతి కొచ్చింది. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. గిట్టుబాట ధర లేదు. ప్రస్తుతం ఉల్లి క్వింటాల్ ధర రూ. 7 వందల నుంచి 8 వందలు పలుకుతోంది.. పంటలసాగుకు ఎకరాకు 70 నుంచి 80 వేల దాకా ఖర్చు వచ్చింది. ధర చూస్తేనేమో కళ్లకు నీళ్లు వస్తున్నాయి. ఒక్క ఉల్లి పరిస్థితే కాదు అన్ని పంటల పరిస్థితి అలాగే ఉంది.

యూరియా ఏది సారూ..



నేను యూరియా కోసం సోమవారం ఉదయం 5 గంటలపాటు లైన్లో నిలుచుకున్నాను. నేను క్యూలో నిలబడే సరికి 20 మంది మాత్రమే రైతుల ఉన్నారు. తీరా నా వద్దకు వచ్చే సరికి యూరియా అయిపోయిందన్నారు. నేను ఏం చేయాలి. నాకు ఖచ్చితంగా యూరియా అవసరం. ఏదీ ఎవరిస్తారు.. ఎప్పుడిస్తారు..
– జెర్రీ గుర్రప్ప, రైతు, దువ్వూరు.

5 గంటలు క్యూలో ఉన్నా యూరియా దొరకలే...



నాకు ఎకరా పొలం ఉంది. యూరియా కోసం దువ్వూరులోని మన గ్రోమోర్ సెంటర్‌కు ఉదయే చేరుకున్నాను. నాకు టోకెన్ నెంబర్(29) ఇచ్చారు. 5 గంటలపాటు క్యూలో ఉన్నా 11 గంటల ప్రాంతంలో యూరియా లేదని చేతులెత్తేశారు. నా వెనకాల వచ్చిన వారికి టోకన్ లేకపోయినా యూరియా ఇచ్చారు. ఇదేమని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.
– టేకూరు రసూల్, రైతు.

ఒక్కొక్కరికి 10 బస్తాలు కూడా...



నేను మూడు ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటను సాగు చేశాను. యూరియా కోసమని ఉదయం 6 గంటలకు దువ్వూరులోని మన గ్రోమోర్ సెంటర్‌కు వచ్చాను. 11 గంటల వరకు వేచి ఉన్నా యూరియా దొరకలేదు. రెకమండేషన్ ఉన్న వాళ్లకు 10 బస్తాలు కూడా ఇస్తున్నారు. ఇదేమని అడిగితే సమాధానమే చెప్పడం లేదు. ఐదు గంటలు నిలబడ్డా బస్తా యూరియా దొరకలేదు.
– దొంతు శ్రీనివాసులు, రైతు, జిల్లెల గ్రామం.

అన్నదాత సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరుబాట

- కమిషన్ల కోసమే ప్రైవేటుకు యూరియా
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న పి.రవీంద్రనాథ్ రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్రం నుంచి యూరియా రాష్ట్రానికి రాగానే కమీషన్ల కోసం కక్కుర్తిపడి మొత్తం ప్రైవేటుకే ఇచ్చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శించారు. దీంతో బస్తా రూ. 270లకు అమ్మాల్సిన యూరియా బ్లాక్‌లో రూ. 800–1000లకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెటీర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై మంగళవారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ర్యాలీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఆ పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, వైస్ చైర్మన్ బాలయ్య, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎరువుల సమస్యపై ఆందోళనలు చేపట్టాలని తమ పార్టీ పిలుపునివ్వడంతో రైతులను మభ్య పెట్టేందుకు అధికారులు టోకన్లు పంపిణీ చేస్తున్నారని రవీంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. తొలుతే ప్రణాళికబద్ధంగా ప్రభుత్వం వ్యవహరించి ఉంటే యూరియా కొరత తలెత్తేది కాదన్నారు. యూరియాకోసం రైతులు సొసైటీల ఎదుట క్యూలు కడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు హేళనగా మాట్లాడటం దారుణమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారన్నారు. కరోనా సమయంలోనూ రైతులను ఆదుకున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరు అజయ్‌కుమార్‌రెడ్డి, వీఎస్ పల్లె, చెన్నూరు ఎంపీపీలు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్‌లో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అనంతరం అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యూరియా బ్లాక్ మార్కెటింగ్‌పై ఉక్కుపాదం

యూరియా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. రైతులకు ఎక్కడా యూరియా సమస్య లేకుండా చూడాలన్నారు. వచ్చే రబీ సీజన్‌కు ఇప్పటినుంచే యూరియా సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి ఎరువులపై రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. కమలాపురం, మైదుకూరు మార్కెట్ కమిటీల ద్వారా ఉల్లి పంట కొనుగోలు చేస్తున్నామని, ఉల్లి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.



ప్రజల అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

వరాలందించే ఆరోగ్యమాత



ముగింపు ఉత్సవాలకు హాజరైన విశ్వాసులు



విశేష అలంకారంలో ఆరోగ్యమాత స్వరూపం

- విశాఖ విశ్రాంత అగ్ర పీఠాధిపతులు మల్లవరపు ప్రకాశ్
- ఘనంగా ముగిసిన ఆరోగ్యమాత ఉత్సవాలు

కడప సెవెన్‌రోడ్స్ : విశ్వసించిన వారికి వరాలు, దీవెనలు అందించి పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ఆరోగ్యమాత అందజేస్తుందని విశాఖ విశ్రాంత అగ్ర పీఠాధిపతులు మల్లవరపు ప్రకాశ్ అన్నారు. కడప నగరం రైల్వేస్టేషన్ సమీపంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవదిన పూజ ప్రార్థన దినోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నగరంలో ఆరోగ్యమాత ఉండడం రాయలసీమ ప్రాంతానికి ఆశీర్వాదకరమని, పది రోజులుగా ఆరోగ్యమాత నవదిన పూజా ప్రార్థనలు వైభవంగా జరిగాయన్నారు. సాయంత్రం 6 గంటలకు ఆయన ఆరోగ్యమాత పతాక అవరోహణ చేశారు. రెవరెండ్ ఫాదర్ బి.జ్వాన్నేస్, రెవరెండ్ ఫాదర్ డేవిడ్‌రాజు పరిశుద్ధ జపమాల, దివ్యసత్ప్రసాద ఆశీర్వాదం చేశారు. ఉత్సవాల్లో జి.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎర్రగుడిపాడుకు చెందిన ఏసన్న బృందం చెక్కభజన భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గురువులు ఎండీ ప్రసాద్‌రావు, ఇతర గురువులు, కన్యస్త్రీలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దేవగుడి X పోట్లదుర్తి

- గండికోటలో పనులు అడ్డుకుంటున్న ఎమ్మెల్యే ఆది వర్గం
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన పోట్లదుర్తి నాయకులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



పనులను అడ్డుకుంటున్న స్థానికులు

టాస్క్‌ఫోర్స్ : జమ్మలమడుగు నియోజకవర్గంలో ఆధిపత్య పోరు రోజు రోజుకు ఎక్కువవుతోంది. నియోజకవర్గంలో 'పోట్లదుర్తి బ్రదర్స్' ఎక్కడ పనులు చేపట్టిన ఆ పనులు అడ్డుకోవడం దేవగుడి బ్రదర్స్‌లో ఒకరయిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి పరిపాటిగా మారిపోయింది. పర్యాటక కేంద్రమైన గండికోటలో అభివృద్ధి పనులు చేపట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం 70 కోట్లకు టెండర్లు పిలిచింది. ఈ టెండర్‌లను లెస్ వేసి రిత్విక్ కంపెనీ పేరుతో పోట్లదుర్తి బ్రదర్స్ దక్కించుకున్నారు. ఇటీవల గ్రామంలో రిత్విక్ కంపెనీ గండికోటలో అభివృద్ధి పనులు చేపట్టడం కోసం యంత్రాలతో వెళ్లారు. స్థానిక శాసనసభ్యుడు ఆదినారాయణరెడ్డి స్థానిక నాయకులను రెచ్చగొట్టి పనులు అడ్డుకోవాలని సూచించారు. దీంతో స్థానిక నాయకులు పనులకు అడ్డు తగులుతూ వస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు మొదలు పెట్టగా రెండు సార్లు గ్రామస్తులు పనులు అడ్డుకున్నారు. చేసేదిలేక రిత్విక్ కంపెనీకి చెందిన ప్రతినిధులు ఎస్పీ, కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. స్థానికంగా ఉన్న అధికారులకు ఈ ఇద్దరి వివాదం తలనొప్పిగా మారిపోయింది. సోమవారం గండికోటలో పోలీసు బందోబస్తు మధ్య పనులు చేస్తున్న కంపెనీని సాయంత్రం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానికులు పనులు అడ్డుకున్నారు. కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం చందంగా.. స్థానికంగా ఇబ్బందులకు గురి అవుతున్నామంటూ అధికారులు వాపోతున్నారు.

గతంలోనూ అంతే..

గతంలో కొండాపురం మండలంలో టి.కోడురు పంచాయతీ పరిధిలో అదాని గ్రూప్ సోలార్ పవర్ ప్రాజెక్టు పనులకు ఎంపీ రమేష్‌నాయుడు దక్కించుకున్నారు. ఈ పనులు ప్రారంభించడానికి వెళ్లిన అధికారులపై దాడులు చేసి భయందోళనకు గురి చేశారు. అప్పట్లో ఈ దాడి సంచలనంగా మారింది. అనకాపల్లి ఎంపీ రమేష్ నాయుడు సీరియస్‌గా తీసుకోవడంతో అధికారులు సైతం అలర్టు అయ్యారు. పనులు చేపట్టడం కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. అలాగే స్థానిక రైతులకు అదనంగా పరిహారం ఇస్తామన్న హామీని అమలు చేయనందున దానికోసం కంపెనీ ముందు ధర్నా నిర్వహించే విధంగా ఇటీవల దేవగుడి సోదరులు పావులు కదిపారు. సీఎంఓ కార్యాలయం నుంచి పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు రావడంతో హుటాహుటిన డీఎస్పీ స్థానిక పోలీసులతో వెళ్లి స్థానిక నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో స్థానిక నాయకులు ధర్నాను విరమించుకున్నారు. అదేవిధంగా ముద్దనూరులో సీఎం సురేష్ నాయుడు వర్గం బ్రాందీషాపు చేజిక్కించుకున్నారు. బ్రాందీషాపు ప్రారంభించటానికి రూములు అద్దెకు ఇవ్వకూడదంటూ ఆదినారాయణ రెడ్డి వర్గానికి చెందిన ఓ నాయకుడు భయపెట్టడంతో స్థానికులు బ్రాందీషాపులకు రూములు అద్దెకు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. చివరకు బ్రాందీషాపుకు తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అయితే సురేష్ నాయుడు అప్పటి ఎస్పీని కలిశారు. దీంతో సీరియస్‌గా తీసుకున్న అధికారులు కంటైనర్‌లో బ్రాందీషాపును మొదట ప్రారంభింపజేశారు.

స్థానికంగానే అమ్మవారి భూ వివాదం...

పోట్లదుర్తి గ్రామంలో ఉన్న పెద్దమ్మ అమ్మవారుకు సంబంధించిన భూములు, అభివృద్ధి విషయంలో పోట్లదుర్తి బ్రదర్స్, ఆదినారాయణరెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ ఏర్పడింది. ఎంపీ నిధులకింద అమ్మవారి ప్రాంగణం అభివృద్ధి చేయాలని సీఎంసురేష్ నాయుడు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. అయితే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు పనులు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య రాళ్లతో దాడులు చేసుకున్న పరిస్థితి ఏర్పడింది. ఇలా ప్రతి విషయంలో పోట్లదుర్తి, దేవగుడి వర్గీయుల మధ్య పనులు విషయంలో ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. తన నియోజకవర్గంలో పోట్లదుర్తి బ్రదర్స్ పెత్తనం ఏమిటంటూ ఆదివర్గం, అధికార పార్టీలో ఉన్న తమ పనులే అడ్డుకుంటార అంటూ పోట్లదుర్తి బ్రదర్స్ పోటా పోటీ పెత్తనం చెలాయిస్తున్నారు. వీరి మధ్య స్థానకంగా ఉన్న అధికారులు ఎవరికి సర్దుబాటు చేయలేక నలిగిపోతున్నారు. మరి ఉన్నతాధికారులు.. ఆయా పార్టీ పెద్దలు ఎలా ముందుకెళతారో వేచి చూడాలి.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప అగ్రికల్చర్ : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి నెల రోజుల వరకు ఈ టీకాల కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,71,400 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పశుసంవర్ధక శాఖ జేడీ శారదమ్మ, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు డీఈఓ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడిజిల్లా అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు తెలిపారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్ 19 స్కూల్ గేమ్స్ సంబంధించి జిల్లా జట్లను ఎంపిక చేయడం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని మేనేజ్‌మెంట్లకు సంబంధించిన పీడీ, పీఈటీ, ఇన్‌చార్జ్ పీడీలు తప్పకుండా హాజరు కావాలని ఆయన తెలిపారు. వివరాలకు 9290760996 నంబర్లో సంప్రదించాలని కోరారు.

చీనీ కాయల మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత



పులివెందుల చీనీ కాయల మార్కెట్‌లో గొడవ పడుతున్న రైతులు, వ్యాపారులు



మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న చీనీ రైతులు

- గిట్టుబాటు ధరలేదని రైతుల ఆందోళన
- దళారులు ముంచేస్తున్నారని మండిపాటు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టన్ను రూ.లక్ష వరకు..
- ప్రస్తుతం రూ.14,200 మాత్రమే

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణ పరిధి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని చీనీకాయల మార్కెట్ వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మార్కెట్‌లోని రైతులు, వ్యాపారస్తుల మధ్య గొడవ చోటు చేసుకుంది. గిట్టుబాటు ధర లేదని రైతులు ధర్నా నిర్వహించారు. వ్యాపారస్తులంతా సిండికేట్ అయి నిండా ముంచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే ఉంటే ఈ నెల 11వ తేదీన మార్కెట్ యార్డుకు తాళాలు వేసే పరిస్థితి నెలకొంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు దారి తీసిన పరిస్థితులు ఇలా ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

గతంలో చీనీ తోటల వద్దకు వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు వచ్చి కొనుగోలు చేసేవారు. అప్పట్లో 10 టన్నులకు సూట్ కింద 2 టన్నుల వరకు వ్యాపారస్తులు, దళారులు రైతుల నుంచి తీసుకునేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు సూట్ అనే పద్ధతిని రద్దు చేసేందుకు ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ను నియమించి మార్కెట్ యార్డులో చీనీ రైతులకు, వ్యాపారస్తుల మధ్య సయోధ్య కుదిర్చారు. సూట్ పద్ధతి లేకుండా మార్కెట్ యార్డులో చీనీ కాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసి అక్కడికే వ్యాపారస్తులు వచ్చి కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేశారు. పులివెందుల ప్రాంతంలోని చీనీ రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించే విధంగా అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జంబో షెడ్డులు ఏర్పాటు చేసి చీనీ కాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. సూట్ అనే విధానాన్ని కూడా లేకుండా చీనీ వ్యాపారస్తులు ప్రశాంతంగా గిట్టుబాటు ధరలతో వ్యాపారాలు చేసుకునేవారు. టన్ను రూ.30 వేల నుంచి లక్ష వరకు పలకడంతో రైతులు ఆనందంగా విక్రయాలు జరిపేవారు.

కూటమి పాలనలో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందుల చీనీ మార్కెట్‌లో దళారులంతా ఏకమై ఒకట్రెండు చీనీ కాయల కుప్పలకు మాత్రమే.. అది కూడా 2 నుంచి 3 టన్నులకు మాత్రమే అధిక ధర వెచ్చిస్తూ కొనుగోలు చేస్తున్నారు. అంతకుమించి ఉన్న మిగిలిన చీనీ కాయల కుప్పలకు నామమాత్రంగా ధరలు నిర్ణయించి నిండా ముంచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు కాకపోతే అనంతపురం మార్కెట్ తీసుకుపోండని వ్యాపారస్తులు ఉచిత సలహాలు ఇస్తున్నారని వారు వాపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో దళారీ వ్యవస్థ ఉండటంతో గిట్టుబాటు ధరలు కూడా అందడం లేదని పేర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో చీనీ ధరలు బాగా ఉండేవని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళారీ వ్యవస్థ జోక్యం చేసుకోవడంతో తమకు ఇష్టం వచ్చిన ధరలకు వేలంపాట నిర్వహిస్తున్నారని రైతులు వాపోతున్నారు. టన్ను రూ.6 వేల నుంచి రూ.20 వేల వరకే పలుకుతుండటంతో గిట్టుబాటు కావడం లేదని అంటున్నారు.

న్యాయం చేయాలి

ఇతర రాష్ట్రాలలో టన్ను చీనీ కాయలు రూ.25 వేలు ఉంటే.. ఇక్కడ ఫస్ట్ క్వాలిటీ రూ.14 వేలు, రూ.12 వేలు పెట్టడం ఏమిటని దళారులపై రైతన్నలు మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారస్తులు వస్తే వారిని మార్కెట్‌కు రానివ్వకుండా.. వారితో కుమ్మక్కై తమను ముంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం పెద్దది కావడంతో అర్బన్ సీఐ సీతారామిరెడ్డి రంగ ప్రవేశం చేసి.. దళారులు, రైతులకు నచ్చజెప్పి వేలంపాటను యథావిధిగా కొనసాగింపజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులకు చీనీ ధర గిట్టుబాటు లేకుండా కొనుగోలు చేస్తే 11వ తేదీ నుంచి మార్కెట్ యార్డులో మండిలన్ని మూసివేసేయాలన్నారు. రైతులెవరూ కూడా మార్కెట్ యార్డులోకి చీనీ కాయలు తీసుకురావద్దన్నారు. తోటల వద్దనే వ్యాపారస్తులకు అమ్మితే బయట నుంచి వచ్చే వ్యాపారస్తులు న్యాయమైన ధరలకు కొనుగోలు చేస్తారన్నారు. మార్కెట్ యార్డులోకి తెస్తే దళారుల చేతుల్లో మోసపోవాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. 11వ తేదీ ప్రతి ఒక్కరూ పులివెందుల మార్కెట్ యార్డు చీనీ మండిల వద్దకు చీనీ రైతన్నలు చేరుకోవాలన్నారు. దళారులు చేస్తున్న మోసాలను నాయకులు, అధికారులు అరికట్టి.. తమకు న్యాయం చేస్తే యథావిధిగా కొనసాగిస్తామని, లేదంటే మండీలు మూత వేయాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు.

క్లుప్తంగా

ప్రజా ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం

ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పునరావృత్తం కాకుండా క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 121 మంది ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ ముఖాముఖి మాట్లాడి.. చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆ ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, పూర్తి వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఇ.బాలస్వామి రెడ్డి, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

రైతు బిడ్డకు జాతీయ స్థాయి పురస్కారం



కేంద్ర మంత్రి నుంచి పురస్కారం అందుకుంటున్న జి.లక్ష్మీనారాయణరెడ్డి, కల్యాణి

వేముల : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో కడప రైతు బిడ్డ గజ్జెల లక్ష్మీనారాయణరెడ్డి అరుదైన జాతీయ స్థాయి పురష్కారాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. వివరాలలోకి వెళితే.. కడప జిల్లా వేముల మండలం కుప్పగుట్టపల్లె గ్రామానికి చెందిన గజ్జెల లక్ష్మీనారాయణరెడ్డి పదేళ్ల క్రితం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిఫార్సుతో టర్బో సర్వీసెస్ రంగంలో కేవలం రూ.1400 జీతంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. చేసే పనిలో అంకితభావరం, కఠోర శ్రమతో అంచెలంచెలుగా ఎదిగారు. ఉద్యోగిగా ఉంటూనే వ్యాపార మెళకువలను ఆకలింపు చేసుకున్నారు. 2017లో కూకట్‌పల్లె కేపీహెచ్‌బీ కాలనీ కేంద్రంగా న్యూ ప్రీమియర్ టర్బో సర్వీసెస్ అనే సంస్థను స్థాపించాడు. కేవలం కొన్నేళ్లలోనే తన సంస్థను అగ్రగామిగా నిలిపాడు. సేవా రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించిన ఓ టీవీ న్యూస్ చానెల్ తెలంగాణాలో నిర్వహించిన కార్యక్రమంలో బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు ఈనెల 5వ తేదీన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా గజ్జెల లక్ష్మీనారాయణరెడ్డి, ఆయన సతీమణి కళ్యాణిలు అందుకున్నారు. ఒకప్పుడు ఉద్యోగం కోసం ఎదురు చూసిన లక్ష్మీనారాయణరెడ్డి నేడు తన సంస్థలో 100మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

భూమి, ఉపాధి కోసం పోరుబాట

- అఖిలభారత రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు
- ఘనంగా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల భారత రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భూ పంపిణీ, సాగునీరు, ఉపాధి హామీ కోసం వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలని అఖిలభారత రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ప్రధాన కార్యదర్శులు విజయ రాఘవన్, విజూ కృష్ణన్ వెంకట్, శివ దాసన్ తెలిపారు. కడపలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని హరిత హోటల్ నుంచి కోటిరెడ్డి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. నూతన ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగం మొత్తం దివాలా తీస్తోందని, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున వలస బాట పడుతున్నారని తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని ధ్వజమెత్తారు. వ్యవసాయ కూలీల వలసల నివారణ కోసం ఆనాడు వామపక్ష పార్టీల ఎంపీలు పెద్ద ఎత్తున పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని నేడు ఎన్‌డీఏ ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించకుండా తూట్లు పొడుస్తోందన్నారు.

పంటలకు దక్కని గిట్టుబాటు ధర

మోదీ పాలనలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని ఢిల్లీ రైతాంగ ఉద్యమం పెద్ద ఎత్తున జరిగినా కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం కనువిప్పు కలగలేదన్నారు. కేరళ తరహా ప్రత్యామ్నాయ విధానాలు భారతదేశ రైతులు, వ్యవసాయ కార్మికులకు కావాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కేంద్రం నిధులకు ఆశపడి రాష్ట్రానికి రావాల్సిన ఎరువులు, యూరియా కోసం బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయలేని పరిస్థితిలో ఉందని తెలిపారు. రానున్న కాలంలో ఎర్రజెండా ఆధ్వర్యంలో వ్యవసాయ కూలీలకు భూములు దక్కే వరకు పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేరళ వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ చంద్రన్, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత నాయకులు విక్రమ్ సింగ్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ లలిత బాలన్‌తోపాటు ఏపీ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల అధ్యక్ష,కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, దండాల సుబ్బారావు, సీపీఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్, కడప జిల్లా రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు అన్వేష్ శివకుమార్, దస్తగిరిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.మనోహర్ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్టీ డే మ్యాచ్‌లో చిత్తూరు, నెల్లూరు విజయం



చిత్తూరు అచ్యుతానంద, 5 వికెట్లు



చిత్తూరు తేజరెడ్డి, 106 పరుగులు



నెల్లూరు అఖిల్, 5 వికెట్లు



నెల్లూరు కారుణ్య ప్రసాద్, 167 పరుగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీడే మ్యాచ్‌లు ఉత్సాహంగా కొనసాగాయి. సోమవారం రెండవ రోజు వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 132 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 55.3 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని తేజరెడ్డి 142 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లతో అద్భుతంగా ఆడి 106 పరుగులు చేశాడు. రెడ్డి ప్రకాశ్ 30 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని ప్రమోద్ కుమార్ 3, ప్రవీణ్‌కుమార్ సాయి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 46.2 ఓవర్లకు 142 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని నిస్కయ్ 47, ప్రవీణ్ కుమార్ సాయి 32 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని అచ్యుతానంద అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. రెడ్డి ప్రకాశ్ 2, బ్రహ్మసాయి తేజ్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. తర్వాత రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 14.5 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. ఆ జట్టులోని తేజరెడ్డి 52, జెనిక్ దాస్ 34 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని భార్గవ 2 వికెట్లు తీశాడు. దీంతో చిత్తూరు జట్టు 8 వికెట్ల తేడాతో రెండవ రోజే విజయం సాధించింది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టుపై నెల్లూరు జట్టు 69 పరుగుల తేడాతో విజయం సాధించింది. సోమవారం రెండవ రోజు 140 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 86.1 ఓవర్లలో 501 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 167, సోహన్ వర్మ 68, మాధవ్ 66, శ్రీ హర్ష 58 పరుగులు చేశారు. కడప జట్టులోని ఎస్ఎండీ ఆయూబ్ 4, వరుణ్‌తేజ్‌రెడ్డి 4, చెన్నారెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 33.1 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని శివ కేశవ రాయల్ 53, నాగ చాతుర్య 33 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని అఖిల్ 5, నారాయణ 2, సూతేజ్‌రెడ్డి 2 వికెట్లు తీశారు.

8 మందిపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగర శివారులోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 7వ తేదీ గంజాయి, మందు బ్యాచ్‌లు దాడి చేయడంతో ముగ్గురు గాయపడ్డారు. నిందితులు కారును ధ్వంసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని రిమ్స్ పోలీసులు తెలియజేశారు.

జిల్లా స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల

ఈనెల 10 నుంచి 17 వరకు ఎంపికలు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర సీఎస్ఈ నుంచి విడుదలైన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10 నుంచి 17 వరకు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపికలు వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి తెలిపారు. ఈ విషయమై సోమవారం కడప డీఈఓ కార్యాలయంలో ఏడీ రామకృష్ణ ఆధ్వర్యంలో షెడ్యూల్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గేమ్స్ షెడ్యూల్ ఇలా..

తేదీ	గేమ్	ఎంపిక స్థలం
10-9-25	ఫెన్సింగ్	ప్రొద్దుటూరు
	కరాటే	రాజంపేట
	మాల్‌కబ్	మైదుకూరు
	బీచ్ వాలీబాల్	కమలాపురం
11-09-15	ఆర్చరీ	వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్, కడప
	ఫుట్‌బాల్	
	సైక్లింగ్	
	వెయిట్‌లిఫ్ట్	
	బాక్సింగ్	
	మోడరన్ పెంటాథ్లాన్	
	జిమ్నాస్టిక్	
	స్విమ్మింగ్	
12-09-25	కురాష్	డీఎస్ఏ స్టేడియం, కడప
	వుషు	
	థాంగ్ టా మార్షల్ ఆర్ట్	
	స్కేటింగ్	
	టెన్నిస్	
	టేబుల్ టెన్నిస్	
	సాఫ్ట్ టెన్నిస్	
15-09-25	రెజ్లింగ్	డీఎస్ఏ స్టేడియం, కడప
	జూడో	
	సెపక్ తక్రా	
	నెట్‌బాల్	రాజంపేట
16.09.25	తైక్వాండో	పోరుమామిళ్ల
	రగ్బీ	పులివెందుల
	షూటింగ్	కడప
17-09-25	గట్కా	జెడ్పీ హైస్కూల్, సిద్దవటం
	కలరిపయట్టు	

రోడ్డు ప్రమాదంలో సాక్షి టీవీ కరస్పాండెంట్‌కు గాయాలు



సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసరావును పరామర్శిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు

కడప అర్బన్ : కడప సాక్షి టీవీ చానెల్ సీనియర్ కరస్పాండెంట్ వెన్ను శ్రీనివాసరావు (50) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన కడప నగరంలోని ఓంశాంతి నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఉదయం తన ఇంటి నుంచి స్కూటీలో వస్తుండగా చెత్తను తరలిస్తున్న ఆటోను తప్పిస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఆయన ఎడమకాలు ఫ్రాక్చర్ అయింది. కడప నాగరాజుపేటలోని సన్‌రైజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆయనను మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్‌బాషా, కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు పరామర్శించారు. సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

పెన్నాలో యువకుడి గల్లంతు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి– ప్రొద్దుటూరు మార్గన ఉన్న పెన్నాలో చేపలు పట్టడానికి వెళ్లి చెన్నూరు ఫయాజ్ (25) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతు అయినారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన నలుగురు యువకులు చేపలు పట్టడానికి పోట్లదుర్తి పెన్నానది వద్దకు సాయంత్రం చేరుకున్నారు. వీరిలో చెన్నూరు ఫయాజ్ అనే యువకుడు చేపలు పట్టడానికి పోయే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడిపోయారు. నది బయట ఉన్న ముగ్గురు యువకులు గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే ఫయాజ్ నదిలో గల్లంతు అయినారు. వెంటనే వారు ఫయాజ్ కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. ఫయాజ్ కుటుంబ సభ్యులు యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లారు. సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఫైర్ సిబ్బంది కూడా సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాలింపులు చేపట్టారు. రాత్రి కావడంతో మంగళవారం ఉదయం గాలింపులు చేసే అవకాశం ఉంది.

దేశంలో యూరియా ఎమర్జెన్సీ విధించాలి

- అధిక ధరకు విక్రయిస్తే చర్యలు చేపట్టాలి
- కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : దేశంలో యూరియా ఎమెర్జెన్సీ విధించాలని, రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర కోరారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎరువుల కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల కేటాయింపులో రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూరియా అందుబాటులో లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతేడాది ఇలాంటి సమస్య రాలేదన్నారు. యూరియా నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా రైతులకు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. కేంద్రం నుంచి వస్తున్న యూరియాలో 80 శాతం ప్రైవేటు షాపులకు ఇస్తూ 20 శాతం మాత్రమే ఆర్‌ఎస్‌కే, సొసైటీలకు సరఫరా చేయడం తగదన్నారు. ఇందువల్ల బ్లాక్‌లో బస్తా రూ.400కు పైగానే అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఒక ఆధార్‌కార్డుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తామనడం తగదన్నారు. డీలర్ల వద్ద యూరియా కొనుగోలుకు వెళితే యూరియాతోపాటు ఇతర ఎరువులు కూడా కొనాలని షరతు పెడుతున్నారని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సీపీఐ నాయకులు వెంకట్రాముడు, శంకర్‌నాయక్, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వరయ్య, బషీర్, పక్కీరప్ప, కొండయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర వ్యాప్తంగా ఇమామ్, మౌజన్లకు ఇవ్వాల్సిన పెండింగ్ గౌరవ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర విభాగం పిలుపులో భాగంగా మైనార్టీ విభాగం జిల్లాశాఖ, నగర శాఖల సంయుక్తాధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మదీన దస్తగిరి, నగర శాఖ అధ్యక్షుడు, కార్పొరేటర్ షఫీ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్.గౌస్‌బాషా మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేలు గౌరవ వేతనం ప్రతినెల చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ జనవరి నుంచి ఇప్పటి వరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. సెప్టెంబరు వరకు ఎనిమిది నెల ల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయ న్నారు. గతేడాది ఎన్నికల సమయమైన ఏప్రిల్, మే, జూన్ నెలల వేతనాలు కూడా చెల్లించలేదన్నారు. ఇలా 11 నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతేడాది మార్చి వరకు వేతనాలు ఇచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాక వేతనాలు పెండింగ్‌లో ఉంచడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. మసీదు కమిటీలు కూడా ఈ చెల్లింపులను భరించలేకపోతున్నాయన్నారు. జనవరి నుంచి సెప్టెంబరు వరకు ఉన్న పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూర్‌బాషా కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తర్వాత జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షఫీ, నగర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసులాజమ్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కరీముల్లా, మైనార్టీ విభాగం మాజీ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ బొగ్దాది, మున్నా తదితరులు పాల్గొన్నారు.